





తూర్పున.. త్రి..నేత్రం!

ముగ్గురికి చంద్రబాబు మార్క్ మంత్రి పదవులు

చంద్రబాబా... మజాకానా.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ముగ్గురు మంత్రులకు శాఖలు కేటాయించారు.. శెహబాస్ అనిపించుకున్నారు.. జిల్లాను దృష్టిలో పెట్టుకుని అత్యంత కీలక శాఖలు కట్టబెట్టారు... జిల్లాలో గ్రామీణ ప్రాంతం చాలా ఎక్కువ... ఈ నేపథ్యంలో పల్లెల దశ..దిశ మారుస్తానంటూ రాజకీయాల్లోకి వచ్చిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖలను కేటాయించారు. మరో మంత్రి కందుల దుర్గేష్‌కు పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖలను కేటాయించారు.. ఇటు గోదావరి నుంచి అటు ఏజెన్సీ వరకు... మరో పక్క ఎంతో అందమైన కడియపులంకను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి జిల్లాలో ఎంతో అవకాశం ఉంది. ఇక మూడో మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు కార్మిక శాఖ కేటాయించారు. మన జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు.. పరిశ్రమల కార్మికులు ఎక్కువే.. ఇలా మూడు శాఖలు 'తూర్పు'నకు త్రినేత్రమే....

- కీలక శాఖలు అప్పగింత
- పల్లెల బాధ్యత పవన్‌కు..
- జిల్లాలో గ్రామాల విస్తీర్ణమే ఎక్కువ
- సురక్షిత తాగునీటికి ఆయనే దిక్కు
- పర్యాటకానికి కేరాఫ్‌గా దుర్గేష్
- జిల్లాలో గోదావరి.. సముద్రం
- కార్మిక సమస్యలు తీర్చేలా సుభాష్
- జిల్లావ్యాప్తంగా బోలెడు పరిశ్రమలు
- లక్షలాదిగా భవన నిర్మాణ కార్మికులు
- 'తూర్పు' దశ మారేలా కేటాయింపులు

పవన్.. పంచాయతీరాజ్

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జనసేన అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్‌కు అత్యంత కీలక శాఖలు లభించాయి. మంత్రులకు శుక్రవారం శాఖల కేటాయింపు జరగ్గా అందులో భాగంగా సీఎం చంద్రబాబు పవన్‌కు అత్యంత ముఖ్యమైన బాధ్యతలు కట్టబెట్టారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలతో పాటు గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యుఎస్), అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను కేటాయించారు. అటు డిప్యూటీ సీఎం పదవి కూడా కేటాయిస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకరకంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సురక్షిత తాగునీరు, ఇంటింటికీ కుళాయి తదితర పనులన్నీ ఈ శాఖల ఆధ్వర్యంలోనే కొనసాగుతాయి. దీంతో జిల్లాలో అత్యధికంగా ఉన్న గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అనేక మంది మంత్రులుగా పనిచేశారు. అయితే పీఆర్, రూరల్ డెవలప్‌మెంట్, ఆర్‌డబ్ల్యుఎస్, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు ఇంతకు ముందు ఎవరికీ దక్కలేదు. ఏ ప్రభుత్వంలో అయినా ఈ కీలక శాఖలను అత్యంత సీనియర్ మంత్రులకే కేటాయించేవారు. కానీ ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే పవన్ కల్యాణ్‌కు డిప్యూటీ సీఎం హోదాలో ఈ ముఖ్యమైన శాఖలను కట్టబెట్టడం విశేషం. వాస్తవానికి ఈ శాఖలు పూర్తిగా గ్రామీణ మండలాలకు సంబంధించినవి. అటు పవన్‌కు కూడా ఈ శాఖల ద్వారా గ్రామాల రూపురేఖలను మార్చాలనే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో అవే దక్కడం విశేషం. పవన్ కల్యాణ్ ఒకట్రెండు రోజుల్లో తనకు కేటాయించిన శాఖల బాధ్యతలను స్వీకరించనున్నారు. ప్రధానంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి జిల్లాలో అనేక పనులు చేపట్టడానికి వీలుంది. ఈ శాఖ పరిధిలోకి పంచాయతీలు, జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు రానున్నాయి. గ్రామాల్లో అభివృద్ధి, వాటి రూపురేఖలను మార్చడం ఈ శాఖ ద్వారానే సాధ్యం. ఈ శాఖకు అటు రాష్ట్రం, ఇటు కేంద్రం నుంచి సైతం నిధులు భారీగా వస్తాయి. తద్వారా జిల్లాలో పంచాయతీలపై దృష్టిపెట్టి వాటిని పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడానికి పవన్‌కు అవకాశం కలిగిందనే చెప్పాలి. ప్రధానంగా పిఠాపురం నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతం ఎక్కువ. తనకు దక్కిన శాఖల ద్వారా నియోజకవర్గంలో పంచాయతీలను ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మేరకు అభివృద్ధి బాట పట్టించడానికి పవన్‌కు మార్గం సుగమమైందనే చెప్పాలి. గ్రామీణ నీటిసరఫరా శాఖ(ఆర్‌డబ్ల్యుఎస్) శాఖ మంత్రిగా పవన్‌కు గ్రామాల్లో ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించడానికి గట్టిగా పనిచేసే అవకాశం లభించిందనే చెప్పాలి. ఇంటింటికీ తాగునీటి కుళాయి పథకం ఈశాఖ పరిధిలోకే వస్తుంది. ఇప్పటికే కేంద్రం జాతీయ జలమిషన్ కింద జిల్లాకు రూ.500కోట్లకుపైగానే కేటాయించింది. కానీ గత వైసీపీ ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వలేదు సరికదా, ఇంటింటికీ కుళాయి పనులను గాలికొదిలేసింది. ఇంటింటికీ సురక్షిత తాగునీరు పథకాన్ని ఎన్నికలకు ముందు టీడీపీ తన సూపర్ సిక్స్‌లో ప్రకటించింది. జిల్లాకు ఈ శాఖ ద్వారా భారీగా నిధులు పవన్ కేటాయించి పనులు చేయించే అవకాశం ఏర్పడింది. వాస్తవానికి కలుషిత నీరు తాగి తొండంగి మండలంలో రెండు రోజులుగా 300 మంది వరకు డయేరియా బారిన పడ్డారు. ఇందులో ఒకరు శుక్రవారం మృతి చెందారు. కలుషిత నీటి మరణాలు లేకుండా గ్రామీణనీటి సరఫరాశాఖ ద్వారా జిల్లాతో పాటు పిఠాపురం నియోజకవర్గానికి సైతం భారీగా నిధులు కేటాయించవచ్చు. అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు పవన్‌కే దక్కాయి. ఆయా శాఖల్లో గత ప్రభుత్వ అరాచకాలపై విచారణ చేయడంతో పాటు ఇకపై వీటి ఉల్లంఘనలు జరగకుండా పవన్ దృష్టిసారించాల్సి ఉంది.

దుర్గేష్‌కు.. పర్యాటకం

రాజమహేంద్రవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి.. ఇది జిల్లా వాసులు పదేపదే వినేమాట.. ఆ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకున్నారో ఏమో కానీ జిల్లా నుంచి నిడదవోలు ఎమ్మెల్యేగా ఎన్నికైన కందుల దుర్గేష్‌కు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రిత్వ శాఖలను కేటాయిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిడదవోలు నియోజకవర్గం ఏర్పడిన తర్వాత తొలిసారిగా కందుల దుర్గేష్‌కు మంత్రి పదవి దక్కింది. ఇప్పటివరకూ జిల్లాకు పర్యాటక శాఖ కేటాయించిన దాఖలాలు లేవు. తొలిసారి ఆ పర్యాటక శాఖ దక్కడంపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పర్యాటకానికి ఎంతో అవకాశం ఉంది. ఒకపక్క ఉభయగోదావరి జిల్లాల్లో ఎంతో అందమైన గోదావరి.. మరోపక్క చూసే కొద్దీ చూడాలనిపించే సముద్రం.. ఇంకోపక్క మడ అడవులు.. ఏజెన్సీ.. అక్కడ జాలువారే జలపాతాలు.. ఇక షూటింగ్‌లు చేసుకోవడానికి ఎంతో అందమైన ప్రకృతి.. సాంస్కృతికపరంగా రాజమహేంద్రవరానికి పెద్ద పేరు.. ఇవన్నీ ఆలోచించే దుర్గేష్‌కు ఆ శాఖలు కేటాయించి ఉంటారని జనం భావిస్తున్నారు.. గత పుష్కరాల సమయంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అఖండ గోదావరిలో బోటు మీద స్వయంగా పర్యటించి అఖండ గోదావరి టూరిజం ప్రాజెక్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పట్లో రూ.100 కోట్లు కేటాయించారు. రాజమహేంద్రవరం కేంద్రంలో ఈ ప్రాజెక్టు కార్యాలయం ఏర్పాటు చేశారు. పిచ్చుకలంకను అభివృద్ధి చేయాలని, హేవలాక్ బ్రిడ్జిని తీర్చిదిద్దాలని, రాజమండ్రిలోని చారిత్రక కట్టడాలను, ప్రాంతాలను పర్యాటక హబ్‌గా మార్చాలని ప్రయత్నం చేశారు. పాపికొండలును అభివృద్ధి చేయాలనుకున్నారు. కాకినాడ హోప్ ఐలాండ్, కోరంగి మడ అడవులు, కోనసీమ ప్రాంతాలను అభివృద్ధి చేసి టూరిజానికి తగినట్టు హోటళ్లు, రిసార్ట్స్ అభివృద్ధి చేసే ప్రయత్నం చేశారు. కానీ జగన్ నాయకత్వంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అఖండ గోదావరి ప్రాజెక్టు మూతపడింది. అసలు పర్యాటక రంగాన్ని పట్టించుకోలేదు. గోదావరి జిల్లాలో టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం అభివృద్ధి ఆగిపోయింది. టూరిజం పట్ల అభి రుచి ఉన్న చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడం, ఈ ప్రాంత అభివృద్ధిని కోరుకునే కందుల దుర్గేష్‌కి పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల దక్కడంతో ఈ ప్రాంతం టూరిజం హబ్‌గా అభివృద్ధి చెందనుంది. మంత్రి పదవి చేపట్టిన తర్వాత తొలిసారిగా రాజమహేంద్రవరం వచ్చిన మంత్రి కందుల దుర్గేష్‌కు సిటీ జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. సుమారు 4 గంటలకు ధవళేశ్వరం వచ్చిన మంత్రి దుర్గేష్ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరడానికి మూడున్నర గంటలు సమయం పట్టింది. అదే సమయంలో వర్షం రావడంతో తడుస్తూనే ర్యాలీ కొనసాగించారు.

కార్మిక శాఖకు..సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 14: కార్మికులు కష్టాలు తీరనున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎటు చూసినా పరిశ్రమలు అధికం.. మరో వైపు భవన నిర్మాణ కార్మికులు ఎక్కువే. ఈ నేపథ్యంలో రామచంద్రపురం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వాసంశెట్టి సుభాష్‌కు కార్మిక శాఖ కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో గతం నుంచీ ఎంతో మంది మంత్రులుగా పనిచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా ఏర్పడిన తరువాత సుభాష్ తొలిసారి మంత్రి పదవి చేపట్టారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎంతో మంది మంత్రులుగా పనిచేశారు. ఇప్పటివరకు ఎవరూ కార్మిక శాఖను చేపట్టిన దాఖలాలు లేవు. జిల్లాలో భవన నిర్మాణ కార్మికులతో పాటు అనేక ఇతర రంగాలకు చెందిన కార్మికులు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అమలు జరిగే అనేక సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోయాయి. కార్మిక సంక్షేమ బోర్డు నిధులు దారి మళ్లించారని విమర్శలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ బోర్డు ద్వారా అమలు జరిగే అన్ని పథకాలు నిలిచిపోయాయి. దీంతో కార్మికులు తీవ్ర ఆవేదన చెందారు. ప్రస్తుత ప్రభుత్వంలో జిల్లాకు కార్మికశాఖ దక్కడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్మిక శాఖ కేటాయించిన వెంటనే మంత్రి సుభాష్ విజయవాడలో కార్మిక శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. కార్మికులకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పథకాలపై చర్చించారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన అన్ని సంక్షేమ పథకాలను పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని మంత్రి సుభాష్ ప్రకటించడంతో కార్మికులు, కార్మిక సంఘాల నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో జగన్ ఫొటోలు ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలను దహనం చేస్తున్న జనసేన శ్రేణులు, రైతులు

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుతో రైతుల్లో ఆనందం

- చేబ్రోలులో జగన్ ఫొటోతో ఉన్న పాసుపుస్తకాలు దహనం

గొల్లప్రోలు రూరల్, జూన్ 14: ప్రజల ఆస్తులపై హక్కు లేకుండా చేసి రైతుల్లో భయాందోళనలు కలిగించిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు పట్ల రైతులు, జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో యాక్టు రద్దుతో శుక్రవారం సంబరాలు నిర్వహించి జగన్ ఫొటోలతో జారీ చేసిన పట్టాదారు పాసుపుస్తకాలను మంటల్లో వేసి దహనం చేశారు. తమ ఆస్తులపై జగన్ ఫొటోలు ఏంటని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాక్టు రద్దుతో పీడ విరగడైందని ఆనందం ప్రకటించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటూ తొలి ఐదు సంతకాలు చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు జ్యోతుల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఆలం దొరబాబు, దమ్ము చిన్నా, కడారి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పొట్టకూటికోసం వెళ్లి పరలోకానికి..

- రోడ్డు ప్రమాదంలో కోనసీమ జిల్లావాసులు నలుగురి మృతి
- కరప మండలం గొర్రిపూడికి చెందిన ఒకరి మృతి
- ఎస్.యానాం, గెద్దనాపల్లిల్లో విషాదఛాయలు

- 7వ

జిల్లా పరిశ్రమల సెంటర్ ఇన్‌ఛార్జ్‌గా ఆదిశేషు



జిల్లా కలెక్టర్ నివాస్‌ను కలిసిన డీఐసీ ఇన్‌ఛార్జ్ జీఎమ్ ఆదిశేషు

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 14: జిల్లా పరిశ్రమల సెంటర్ ఇన్‌ఛార్జ్ జీఎంగా ఆదిశేషును ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన ఏలూరు జిల్లా పరిశ్రమల సెంటర్ జనరల్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. కలెక్టర్ జె.నివాస్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షా ఫలితాలు విడుదల

- జిల్లాలో 191మంది విద్యార్థుల ఎంపిక

కాకినాడ రూరల్, జూన్ 14: కాకినాడ జిల్లాలో డిసెంబరు 3న నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 4170మంది విద్యార్థులకుగాను 191మంది ఎంపికైనట్లు డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. ఫలితాలను డీఈవో కార్యాలయంలోగానీ, ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వారి వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఎస్ఈఏపీ.ఓఆర్‌జీలో గానీ తెలుసుకోవచ్చున్నారు. జాతీయ విద్యా మంత్రిత్వశాఖ న్యూఢిల్లీ వారి నియమాల ప్రకారం ఏదైనా జాతీయ బ్యాంకులో విద్యార్థి పేరున సేవింగ్స్ ఖాతా తీసుకుని తల్లి లేదా తండ్రిని జాయింట్ చేసుకోవాలని విద్యార్థి ఆధార్ నెంబరును మాత్రమే సేవింగ్స్ ఖాతాకు సీడ్ చేయించాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకోసం త్వరలో జాతీయ విద్యామంత్రిత్వశాఖ న్యూఢిల్లీ వారి నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ తెరవబడుతుందన్నారు. విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టినతేదీ, మెరిట్ కార్డులో ఉన్న విధంగానే ఆధార్ కార్డులోను, బ్యాంక్ పాస్ బుక్‌లోను ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని డీఈవో సూచించారు.

భార్యపై హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలు

సర్పవరం జంక్షన్, జూన్ 14: భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన భర్తకు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. కాకినాడ రూరల్ రమణయ్యపేట శివారు పాతగైగోలుపాడుకు చెందిన నరాల సూరిబాబు, కుమారి భార్యాభర్తలు. వీరికి 20ఏళ్ల కిందట వివాహం జరిగింది. భార్యను తరచూ అనుమానించి వేధించడంతో తరచూ గొడవలు జరిగేవి. 2022, మే 21న భార్య కుమారి ఇంటి వద్ద తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో భార్యను చాకుతో కడుపులో పొడిచి చంపేందుకు ప్రయత్నించాడు. కుమార్తె ఫిర్యాదు మేరకు సర్పవరం ఏఎస్ఐ ఎం.నాగేశ్వరరావు కేసు నమోదు చేయగా ఎస్ఐ ఎన్.సతీష్‌బాబు విచారణ నిర్వహించి దర్యాప్తు పూర్తి చేసి నిందితుడు నరాల సూరిబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువు కావడంతో నిందితుడు నరాల సూరిబాబుకు పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ కాకినాడ మూడో అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి ఎస్.రమేష్‌నాయుడు తీర్పునిచ్చినట్లు సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ ఎస్.గంగాదేవి వాదించారన్నారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు.

అదుపులోకి రాని డయేరియా

- కొమ్మనాపల్లిలో డయేరియాతో మహిళ మృతి
- బాధితులకు తుని ఎమ్మెల్యే విజేత దివ్య పరామర్శ

- 7వ



చెత్తా, వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

డీఎంహెచ్‌వో కార్యాలయంలో శ్రమదానం

జీజీహెచ్(కాకినాడ), జూన్ 14: కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో సిబ్బందితో కలిసి డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ఆధ్వర్యంలో పారిశుధ్యం, ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం, నిల్వ ఉన్న వ్యర్థ పదార్థాలను తొలగించడం ద్వారా అందరూ ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీ కేంద్రాల పరిధిలో విధిగా డ్రై డే-ఫ్రైడే కార్యక్రమం స్థానిక పంచాయతీ సిబ్బందితో కలిసి నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్తా, వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జడ్ఎంవో డాక్టర్ ఆర్.రమేష్, డీఐవో డాక్టర్ కె.రత్నకుమార్, ఇన్‌చార్జి డీపీఎం డాక్టర్ సురేఖ, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఏవో జి.దేవకుమారి, ఇన్‌చార్జి డీఎంవో ఎస్.భాస్కరరావు పాల్గొన్నారు.

రూ.2.30కోట్లతో 'లోవ'లో రాజగోపురం నిర్మాణం

- శరవేగంగా ఐదంతస్తుల నిర్మాణ పనులు

తుని రూరల్, జూన్ 14: లోవ దేవస్థానంలో భక్తుల అవసరాలకు అనుగుణంగా చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రూ.2.30కోట్లతో నిర్మాణమవుతున్న ఐదంతస్తుల నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. 85 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పుతో నిర్మిస్తున్న ఈ ఆలయ గోపురంపై ఆగమ శాస్త్రాన్ని అనుసరించి వేద పండితుల సలహాలు, సూచనలతో రెండు వందలకుపైగా వివిధ దేవతామూర్తుల విగ్రహాలు గోపురంపై కొలువు తీర్చనున్నారు. ఈ నమూనా ఇప్పటికే తయారు చేయించామని తెలిపారు. భారీ గోపుర నిర్మాణంలో అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని లక్షకు పైగా ఇటుకలు, 85టన్నుల ఇనుము, 5వేల బస్తాల సిమెంటు, 15 లారీల మెటల్ వినియోగించనున్నట్లు దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు తెలుపుతున్నారు. రాజగోపురం పనులు మరో ఆరు నెలల లోపు పూర్తి చేసి జనవరి నాటికి రాజగోపురం గుండా ప్రవేశించి అమ్మవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కొండపైన ఉన్న అమ్మ వారిని భక్తులు దర్శించుకునేందుకు మెట్ల మార్గంతోపాటు ఎక్స్‌లేటర్ అనుమతులు వచ్చాయని టెండర్ దశలో ఉందని దేవస్థానం ఈవో విశ్వనాథ రాజు తెలిపారు.



నిర్మాణ దశలో ఉన్న రాజగోపురం

భార్యను కడతేర్చిన భర్తకు జీవిత ఖైదు

సర్పవరం జంక్షన్, జూన్ 14: భార్య భర్తల మధ్య తలెత్తిన మనస్పర్థలతో కట్టుకున్న భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ కాకినాడ 3వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పి.కమలాదేవి తీర్పునిచ్చారు. కాకినాడ అర్బన్ వెంకట్‌నగర్‌కు చెందిన బిక్కిలి రామకృష్ణ, హారతిలక్ష్మిల కు 2012లో వివాహం జరిగింది. అనంతరం వీరిద్దరి మధ్య మనస్పర్థల తో గొడవలు జరిగాయి. 2014, డిసెంబరు 2న రామకృష్ణ భార్యను కాకినాడ బీచ్‌కు తీసుకువెళ్లాడు. తిరిగి ఇంటికి ఏడీబీ రోడ్డులో వచ్చే సమయంలో పాముగుంట కొత్తూరు జంక్షన్ వద్దకు వచ్చిన తర్వాత రాత్రి 8.30 గంటల సమయంలో భార్య హారతి లక్ష్మిని పీక కోసి హత్య చేసిన ట్లు మృతురాలి తండ్రి సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి కాకినాడ ఎస్‌డీపీవో ఎస్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేశారు. కాకినాడ మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో శుక్రవారం నిందితులను విచారించిన తర్వాత నేరం రుజువు కావడంతో భార్యను భర్త బిక్కిలి రామకృష్ణ హత్య చేసిన ట్లు నేరం రుజువు కావడంతో జడ్జి పి.కమలాదేవి నిందితుడికి జీవిత కాలపు శిక్ష విధించారు. దీంతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఈ హత్య లో ఆరోపణలు ఎదుర్కొన్న గండేపల్లి వెంకటరావు, గండేపల్లి లక్ష్మి, బిక్కి లి సరస్వతి నిరపరాధులుగా తీర్పునిచ్చారన్నారు. ప్రాసిక్యూషన్ తరపున కాకినాడ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు అడిషనల్ పీపీ కె.ఆదిత్యకుమార్ వాదించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఎస్‌డీపీవో కె.హనుమంతరావు, ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్‌లను ఎస్పీ అభినందించారు

డయేరియా బాధితులకు నాణ్యమైన వైద్యసేవలు

- కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి
- జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కొమ్మనాపల్లి బాధితులు

జీజీహెచ్(కాకినాడ), జూన్ 14: డయేరియా బాధితులకు వైద్యులు మెరుగైన వైద్యచికిత్సలు అందిస్తున్నట్లు, భయాందోళనకు గురికావాల్సిన పనిలేదని కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. తొండంగి మండలం కొమ్మనాపల్లిలో వాంతులు, విరోచనలతో అస్వస్థతకు లోనైన 21మంది బాధితులు మెరుగైన వైద్యంకోసం జీజీహెచ్‌కు రాగా వీరి ఆరోగ్య పరిస్థితి, వైద్యసేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డయేరియాతో 25మంది వైద్యం పొందుతున్నట్లు తెలిపారు. డయేరియా రోగులకోసం ఈఎన్‌టీ విభాగంలో 25 మంచాలతో ప్రత్యేక డయేరియా వార్డును ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ వెంటిలేటర్లు, ప్రత్యేక వైద్యబృందం, మెడిసిన్, ఎనస్తీసియా, టెక్నీషియన్లు, హౌస్ సర్జన్లు, ఎలక్ట్రీషియన్లు, నర్సింగ్, పీజీ, సీఎంవోలతో మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం డయేరియా ప్రత్యేక వార్డులో 9మంది, పీడియాట్రిక్స్ వార్డులో 9మంది, క్యాజువాలిటీలో 5, ఏఎంసీయూలో ఇద్దరితో కలిపి 25మంది డయేరియా రోగులకు చికిత్స చేస్తున్నట్లు వివరించారు. ఏఎంసీయూలో చికిత్స పొందుతున్న ఇద్దరు తీవ్ర అస్వస్థతకు లోనుకావడంతో కలెక్టర్ ఆదేశాలతో స్థానిక ట్రస్ట్ ఆస్పత్రికి తరలించామన్నారు. ప్రస్తుతం 23మంది చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపారు. డయేరియా ప్రబలడానికిగల కారణాలను పరిశీలించేందుకు జిల్లానుంచి రాపిడ్ రెస్పాన్స్ టీమ్ సంఘటనా స్థలానికి వెళ్లిందన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య



పొట్టకూటి కోసం వెళ్లి పరలోకానికి..

- కృష్ణా జిల్లా రోడ్డు ప్రమాదంలో కోనసీమ జిల్లావాసులు నలుగురి మృతి
- కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడికి చెందిన మరొకరు మృత్యువాత
- మరో అయిదుగురికి తీవ్ర గాయాలు
- ఎస్.యానాం, గెద్దనపల్లి, గొర్రిపూడి గ్రామాల్లో తీవ్ర విషాదచాయలు

ఉప్పలగుప్తం, జూన్ 14: కృష్ణా జిల్లా కృత్తివెన్ను వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలకు చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంకు చెందిన రేవు భూషణం (26), పెనంగి కనకరాజు (32) అక్కడికక్కడే మృతి చెందారు. కాట్రేనికోన మండలం గెద్దనపల్లికి చెందిన చింతా లోవరాజు, మాగాపు నాగరాజు మృతి చెందగా, తీవ్రగాయాలపాలైన చింతా దుర్గాప్రసాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరితోపాటు ప్రయాణిస్తున్న యువకులు రేవు జ్ఞానేశ్వరరావు, సంగాని నాగేంద్రబాబు, మల్లాడి శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా చేపల పట్టుబడి కోసం కాకినాడ జిల్లా తాళ్లరేవు నుంచి బొలెరో వాహనంలో వెళ్తుండగా చేపల కంటైనర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఎస్.యానాం, గెద్దనపల్లిలో విషాదచాయలు నెలకొన్నాయి. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

పని కోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు...

కుటుంబాలను పోషించుకునేందుకు రోజూ మాదిరిగానే ఇంటి నుంచి బయలుదేరారు. శుక్రవారం ఉదయమే కుటుంబ సభ్యులకు విషాద వార్త అందింది. దీంతో ఎస్.యానాంలో విషాదం నెలకొంది. ప్రతిరోజూ రాత్రి ఎస్.యానాం నుంచి కొందరు యువకులు చేపల పట్టుబడికి ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. పలు గ్రామాల నుంచి తాళ్లరేవు వెళ్లి అక్కడి నుంచి అందరూ కలిసి చేపల పట్టుబడి ప్రాంతాలకు వాహనాలపై వెళ్తారు. గురువారం అర్ధరాత్రి అదే విధంగా 12 మంది బొలేరో వాహనంలో బయలుదేరి వెళ్లారు. ఆ ప్రయాణమే కొందరికి ఆఖరి పయనం అయ్యింది. కాగా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంకు చెందిన మృతుడు రేవు భూషణానికి ఏడాది కిందటే వివాహమైంది. అతడి భార్య జ్యోతి గర్భవతి. మరో మృతుడు కనకరాజుకు భార్య, కూతురు ఉన్నారు. రోజూ మాదిరిగానే ఇంటికి అవసరమైన సామగ్రి తీసుకుని వస్తారని ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులను ఇక తమవారు లేరన్న సమాచారం నిలువునా కుంగదీసింది. మృతుల కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. కనకరాజు పిల్లలు తండ్రి కోసం పదేపదే అడుగుతుంటే ఇరుగుపొరుగు వారు సముదాయించలేక కన్నీరు పెట్టుకుంటున్నారు. గర్భవతిగా ఉన్న జ్యోతి తన భర్త ఇక లేడన్న వార్తను జీర్ణించుకోలేక విలపిస్తున్న తీరు వర్ణనాతీతం. ఎంపీటీసీ పెట్టా అప్పారావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, లంకే చిరంజీవిలు ప్రమాదస్థలికి వెళ్లి పర్యవేక్షించారు.

పిల్లలకు, తల్లికి.. దిక్కెవరు?

కాట్రేనికోన, జూన్ 14: ఇదే ప్రమాదంలో కాట్రేనికోన మండలం గెద్దనాపల్లికి చెందిన మాగాపు నాగరాజు మృతితో అతని కుమారుడు సతీష్, కుమార్తె చంద్రికశ్రీ, తల్లి సూర్యకాంతం దిక్కులేనివారయ్యారు. ప్రేమ వివాహం చేసుకున్న నాగరాజు మనస్పర్థల కారణంగా విడాకులు తీసుకున్నాడు. దీంతో కుమార్తె చంద్రిక తండ్రి వద్ద, కుమారుడు సతీష్ తల్లి వద్ద ఉంటున్నారు. వృద్ధురాలైన తల్లి నాగరాజు వద్ద ఉంటోంది. రాత్రి వరకు తన ముందు కదలాడిన కుమారుడు మృతి చెందాడన్న విషయాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతోంది. తండ్రి ఎప్పుడు తిరిగివస్తాడని కుమార్తె అమాయకంగా అడుగుతోంది. నాగరాజు కూలిపనితో జీవిస్తుండగా, ఇప్పుడా కుటుంబం జీవనాధారం కోల్పోయింది. అదేవిధంగా ఇదే గ్రామానికి చెందిన చింతా లోవరాజు మృతి వార్త విన్న అతడి భార్య విజయ, తల్లిదండ్రులు సత్యనారాయణ, గంగాయమ్మ కుప్పకూలిపోయారు. లోవరాజు కుమార్తె దేవిశ్రీ, కుమారుడు హేమంత్ విషయం అర్థంకాక బేలచూపులు చూస్తున్నారు. మత్స్యకారులైన వీరికి చేపలవేటే ఆధారం. వేటలేని సమయంలో చేపల ప్యాకింగ్, ఇతర పనులకు వెళ్లి లోవరాజు కుటుంబ పోషణ చేస్తుంటాడు. ఈ సంపాదనతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. చేతికి అందివచ్చిన కుమారుడి మరణంతో వృద్ధులైన తల్లిదండ్రులు, చిన్న వయసులో భర్త మరణించడంతో ఇద్దరు పిల్లలతో ఎలా జీవించాలంటూ లోవరాజు భార్య విజయ బోరున విలపించడం అందరినీ కలచి వేసింది.


గెద్దనపల్లిలో రోదిస్తున్న లోవరాజు భార్య, పిల్లలు

కృత్తివెన్ను రోడ్డు ప్రమాదంలో గొర్రిపూడి వాసి మృతి

కరప, జూన్14: రెక్కాడితే గాని డొక్కాడని బతుకులను రోడ్డు ప్రమాదం చిదిమేసింది. కుటుంబాలకు ఆధారభూతమైన వారిలో ఒకరిని మృత్యువు కబళించగా, మరొకరు తీవ్రగాయాలతో ఆసుపత్రిపాలయ్యాడు. దీంతో రెండు కుటుంబాలు రోడ్డునపడి గ్రామంలో తీవ్ర విషాదచాయలు అలముకున్నాయి. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద 216 జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన గండి ధర్మవరప్రసాద్ (27) మృత్యువాత పడగా, మేడిశెట్టి మహేష్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గొర్రిపూడి గ్రామానికి చెందిన ధర్మవరప్రసాద్, మహేష్‌కుమార్ ఒక చేపల కంపెనీలో పనిచేస్తున్నారు. ధర్మవరప్రసాద్ డ్రైవర్‌గాను, మహేష్‌కుమార్ గుమస్తాగాను విధులు నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మరో తొమ్మిది మందితో కలిసి కృత్తివెన్ను మండలం మునిపెడ గ్రామంలో చేపల పట్టుబడికి బొలెరో వాహనంలో బయలుదేరి వెళ్లారు. సీతనపల్లి వద్ద పుల్లల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేస్తూ ముందున్న కంటైనర్‌ను వీరు ప్రయాణిస్తున్న వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ధర్మవరప్రసాద్‌తో పాటు మరో ఐదుగురు మృత్యువాతపడ్డారు. మహేష్ కుమార్ తలకు, నడుముకు తీవ్రగాయాలయ్యాయి. రోడ్డుప్రమాద విషయం తెలిసిన వెంటనే గొర్రిపూడి నుంచి రెండు కుటుంబాలకు చెందిన పలువురు ఘటనాస్థలికి చేరుకున్నారు. ధర్మవరప్రసాద్ మృతిచెందిన విషయం తెలుసుకుని కుటుంబసభ్యులు బోరున విలపించారు. అతడికి ఏడాదిన్నర పాప, భార్య వరలక్ష్మి ఉండగా ఆమె ప్రస్తుతం నిండు గర్భిణి. తండ్రి సత్యనారాయణమూర్తి దివ్యాంగుడు కాగా, తల్లి వరలక్ష్మి వినికిడిలోపం సమస్యతో బాధపడుతోంది. వీరితోపాటు వృద్ధాప్య దశలో ఉన్న తాత ధర్మారావు బాధ్యతలు కూడా మృతుడు ధర్మవరప్రసాద్ చూసుకుంటున్నాడని, ఇప్పుడు తమకెవరు దిక్కంటూ బాధితుల ఆక్రందనలు చూపరులను కంటతడి పెట్టిస్తున్నాయి. మరోపక్క భర్త చనిపోయిన విషయం పుట్టింట్లో ఉంటున్న అతని భార్యకు ఎలా చెప్పాలి దేవుడా అంటూ కుటుంబసభ్యులు విలపిస్తున్నారు. ఇక ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహేష్‌కుమార్ క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నారు.


కరప మండలం గొర్రిపూడిలో మృతుడి ఇంట రోదిస్తున్న కుటుంబ సభ్యులు


కాట్రేనికోన మండలం గెద్దనపల్లిలో నాగరాజు ఇంటి వద్ద విషాదచాయలు

మేనల్లుడి చేతిలో మేనమామ హతం

నాపరాయితో కొట్టి చంపిన వైనం



వరప్రసాద్.. మృతదేహం

పిఠాపురం రూరల్, జూన్ 14: మేనల్లుడి చేతిలో మేనమామ హతమయ్యాడు. నాపరాయితో కొట్టి హతమార్చిన ఘటన పిఠాపురం మండలం భోగాపురంలో సంచలనం కలిగించింది. గ్రామానికి చెందిన బ్రహ్మదేవపు వరప్రసాద్(44), నాగులాపల్లి పద్మరాజులు వరుసకు మేనమామ, మేనల్లుడు. వీరిద్దరు తాపీ పనికి వెళుతూ తమ కుటుంబాలను పోషించుకుంటారు. వీరి కుటుంబాల మధ్య కొంతకాలంగా కలహాలు ఉన్నాయి. గురువారం రాత్రి పనికి వెళ్లి తిరిగి వచ్చిన తర్వాత వీరిద్దరి మధ్య కూలీ డబ్బుల విషయంలో ఘర్షణ జరిగింది. అనంతరం ఎవరికి వారు వెళ్లిపోయారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట సమయంలో గుడిలో నిద్రిస్తున్న వరప్రసాద్‌ను పద్మరాజు నాపరాయితో కొట్టి హత్య చేశాడు. దీంతో రక్తపు మడుగులో పడి వరప్రసాద్ అక్కడికక్కడే మరణించాడు. పద్మరాజు పరారయ్యాడు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ గుణశేఖర్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వరప్రసాద్ సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

సముద్రంలో స్నానానికి దిగి యువకుడు మృతి

ఉప్పలగుప్తం, జూన్ 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం బీచ్‌లో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు ఒక యువకుడు మృతి చెందాడు. మృతి చెందిన యువకుడిని విశాఖపట్నానికి చెందిన అనుదీప్(24)గా గుర్తించారు. ఎస్.యానాంలో ఒక ఓఎన్జీసీ ఉద్యోగిని కలుసుకునేందుకు ముగ్గురు యువకులు విశాఖ నుంచి శుక్రవారం వచ్చారు. వీరు బీచ్‌లో స్నానం చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అనుదీప్ సముద్రంలో తేలుతుండగా వెంటనే ఒడ్డుకు తీసుకువచ్చి కెయిర్న్ అంబులెన్స్‌లో అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారణ కావడంతో వెంటనే విశాఖకు తరలించారు. శుక్రవారం 11-12 గంటల మధ్య ఈ ప్రమాదం జరిగిందని, తమకు సమాచారం తెలిసిన వెంటనే అమలాపురం ఆసుపత్రికి వెళ్లగా అప్పటికే మృతదేహాన్ని విశాఖ తరలించారని వీఆర్వో అవిడి రాము చెప్పారు.

ఆడుకునేందుకు ఆటో కిందకు.. గమనించకుండా ముందుకు నడిపిన డ్రైవర్

నాలుగేళ్ల బాలుడు దుర్మరణం



పిఠాపురం రూరల్, జూన్14: ఆటలు ఆడుకుంటూ ఆటో కిందకు దూరాడు నాలుగేళ్ల బాలుడు. అది గమనించకుండా ఆటోను డ్రైవర్‌కు ముందుకు నడపడంతో కిందపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ విషాదకర ఘటన పిఠాపురం మండలం పి.దొంతమూరులో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన కుక్కల అశ్విన్(4) శుక్రవారం ఆడుకుంటూ ఉన్నాడు. అదే సమయంలో గ్రామంలో ఉప్పు అమ్ముతూ వచ్చిన ఆటో అక్కడ ఆగింది. అశ్విన్ ఆడుకుంటూ ఆటో కిందకు వెళ్లాడు. అది గమనించని డ్రైవర్ ఆటోను ముందుకు నడిపాడు. దీంతో ఆటో కింద ఉన్న అశ్విన్ మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మరణించాడు. తండ్రి వెంకట్రావు కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తాడు. అశ్విన్‌కు రెండేళ్ల తమ్ముడు ఉన్నాడు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌కు గురై భవన నిర్మాణ కార్మికుడు మృతి

నేరేడు చెట్టు ఎక్కడంతో విద్యుత్ తీగలు తగిలి ప్రమాదం



ప్రత్తిపాడు, జూన్14: నేరేడు పండ్ల కోసం చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తగిలి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ధర్మవరంనకు చెందిన బెజవాడ భాస్కరరావు (39) భవన నిర్మాణ కార్మికుడుగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం నేరేడు పండ్ల కోసం చెట్టు ఎక్కి పండ్లు కోస్తుండగా విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై చెట్టు మీద నుంచి కింద పడ్డాడు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న భాస్కరరావును స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతి చెందాడు. భాస్కరరావుకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భవన నిర్మాణ కార్మికుడుగా రోజువారీ పనులతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న భాస్కరరావు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడంతో అతని కుటుంబం జీవనాధారం కోల్పోయింది. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరేడు చెట్టు నుంచి జారి పడి యువకుడి మృతి



రాజానగరం, జూన్14: నేరేడు చెట్టు ఎక్కి పండ్లు కోస్తుండగా చెట్టు కొమ్మ విరిగిపడి ఒక యువకుడు మృతిచెందాడు. రాజానగరం మండలం పాలచర్ల గ్రామానికి చెందిన దేవాబత్తుల శివనాగ దుర్గ (27) పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం నేరేడు చెట్టు ఎక్కి పండ్లు కోస్తుండగా కొమ్మ విరిగిపోవడంతో ప్రమాదవశాత్తూ కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా దుర్గ భార్య కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

కొమ్మనాపల్లిలో అదుపులోకి రాని డయేరియా

- మహిళ మృతి • ఎమ్మెల్యే దివ్య పరామర్శ
- జిల్లా అధికారుల సందర్శన
- ట్యాంకుల ద్వారా తాగునీటి సరఫరా
- కారణం నిర్ధారించని అధికారులు



రోగుల్ని పరామర్శిస్తున్న యనమల దివ్య (కింద) మృతి చెందిన నాగమణి

తొండంగి, జూన్14: కొమ్మనాపల్లిలో ప్రబలిన డయేరియా వ్యాధి ఇంకా అదుపులోకి రాలేదు. శుక్రవారం కొత్తగా మరో 11 కేసులు నమోదయ్యాయి. దొడ్డి నాగమణి (35) అనే మహిళ డయేరియా వ్యాధితో మృతి చెందడంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. నాగమణికి వాంతులు అవుతుండడంతో శుక్రవారం ఉదయం సీతంపేట ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మరణించింది. నాగమణికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతితో గ్రామంలో ఆందోళన నెలకొంది. కొత్తగా నమోదైన కేసులతో ఇప్పటివరకూ అధికారికంగా 34 కేసులు నమోదైనప్పటికీ ఇంకా పలువురు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్టు గ్రామస్తులు తెలుపుతున్నారు. గ్రామ సచివాలయంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ భారతిలు చికిత్స అందిస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి రోగుల్ని గుర్తిస్తున్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి బ్లీచింగ్ క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. సచివాలయంలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఇప్పటికే సుమారు 10 మందిని అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. వైద్య శిబిరం వద్ద అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచారు. జిల్లా వైద్యాధికారి నర్సింహనాయక్, జిల్లా పంచాయతీ అధికారి సౌజన్యలు గ్రామంలో పర్యటించి పరిస్థితిని అంచనా వేశారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. వాటర్ శాంపిళ్లు సేకరించి పరీక్షకు పంపినట్టు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ శ్రీనివాస్ తెలిపారు.

రోగులు ధైర్యంగా ఉండాలి: ఎమ్మెల్యే దివ్య

డయేరియా రోగులు మనోధైర్యంతో ఉండాలని తుని ఎమ్మెల్యే దివ్య అన్నారు. శుక్రవారం ఆమె కొమ్మనాపల్లి వైద్య శిబిరంలో రోగుల్ని పరామర్శించారు. జిల్లా వైద్యాధికారి నర్సింహనాయక్, ఎస్ఈ శ్రీనివాస్ తదితర అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారని ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. అవసరమైతే తక్షణం కాకినాడ తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించామన్నారు. టీడీపీ నాయకులు యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్, చింతంనీడి అబ్బాయి, కోడ వెంకటరమణ ఆమె వెంట ఉన్నారు. కాగా గ్రామంలో డయేరియా వ్యాధి ప్రబలడానికి ఆహారం లేదా నీటి కాలుష్యం కారణంగా ఏర్పడి ఉండవచ్చని జిల్లా వైద్యాధికారి నాయక్ తెలిపారు. రోగుల శరీరంలో ఇన్‌ఫెక్షన్ స్థాయి అధికంగా ఉండడం వల్ల ప్రధానంగా కలుషిత ఆహారం భుజించి ఉండవచ్చన్నారు. నీటి శాంపిళ్లు సేకరించి పరిశీలించామని, శాంపిళ్లను కాకినాడ ల్యాబ్‌కు కూడా పంపి పరీక్ష చేయిస్తామన్నారు. అంతవరకూ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. పైప్‌లైన్ల లీకుల కారణంగా డ్రైనేజీ వాటర్ తాగునీటిలో కలిసి వ్యాధి ప్రబలి ఉండవచ్చని పలువురు అధికారులకు తెలపగా అటువంటిది లేదన్నారు. ఆర్డీవో సీతారామాంజనేయులు, డీఎల్‌పీవో గ్రామాన్ని సందర్శించారు.



పోటీల్లో పరుగులు తీస్తున్న ఎడ్ల బండి.. ప్రథమ బహుమతి అందజేస్తున్న తమ్మయ్యబాబు

రాష్ట్ర స్థాయి ఎడ్లపోటీల్లో విజేతలు వీరే

ఏలేశ్వరం, జూన్14: మండలంలోని తిరుమాలి గ్రామంలో నేరేళ్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్రస్థాయి ఎడ్లబళ్ల పోటీలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఎడ్లబళ్ల పోటీలకు సీనియర్ విభాగంలో 7జతలు, జూనియర్ విభాగంలో 27 జతలు పాల్గొన్నాయి. వీటిలో సీనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో అనకాపల్లి జిల్లా లంకెవానిపాలెం గ్రామానికి చెందిన శ్రీపైడితల్లి అమ్మ, మండపేట గ్రామానికి చెందిన పెనుమర్తి బొబ్బిలి రాజు, కొవ్వాడ గ్రామానికి చెందిన మట్లాన వనీత్ శ్రీమణికంఠ వారి ఎడ్లు గెలుపొందగా, జూనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కొప్పవరం గ్రామానికి చెందిన బండారు శ్రీను, దుళ్ల గ్రామానికి చెందిన తూము శ్రీను, కొవ్వాడ గ్రామానికి చెందిన మట్లాన వనీత్ శ్రీమణికంఠ ఎడ్లు కైవసం చేసుకొన్నాయి. సీనియర్స్‌కి నగదు ప్రథమ బహుమతి రూ.12 వేల నగదుతోపాటు మెమొంటో, ద్వితీయ బహుమతి రూ.10వేలు నగదుతోపాటు మెమొంటో, తృతీయ బహుమతి రూ.8 వేల నగదుతోపాటు మెమొంటో, జూనియర్స్‌కి నగదు ప్రథమ బహుమతి రూ.10 వేల నగదుతోపాటు మెమొంటో, ద్వితీయ బహుమతి రూ.8 వేల నగదుతోపాటు మెమొంటో, తృతీయ బహుమతి రూ.6 వేల నగదుతోపాటు మెమొంటో ప్రత్తిపాడు జనసేన ఇంచార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణరాజు (మీసాల రాజు) చేతుల మీదుగా బహుమతులు, నగదు ప్రదానం అందజేశారు. ఈ నగదు, బహుమతులు, జ్ఞాపికలు చందువోలు నాగరాజు జ్ఞాపకార్థం వారి కుమారుడు చందువోలు రాజా, చింతపల్లి వరహాలు జ్ఞాపకార్థం వారి కుమారుడు సూర్యనారాయణ, కోలా వీరబాబు, కోరుకొండ రుద్రయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు కోరుకొండ నూకరాజు, తిరుమాలి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు కానూరి బ్రహ్మానందం, మాడెం పెంటయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు ధర్మరాజు, పసల సూరిబాబు, ఓలేటి చంటిబాబు, సూతి అప్పలరాజు అందజేశారు.

రాష్ట్రంలో రాక్షస పాలన అంతమొందింది

జనసేన నియోజకవర్గాల్లో డొక్కా సీతమ్మ క్యాంటిన్లు ఏర్పాటుచేయాలి
శ్రీలంక బౌద్ధ భిక్షువు బోధి హీన్


లంకలగన్నవరం డొక్కా సీతమ్మ నివాసంలో సీతమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న శ్రీలంక బౌద్ధ భిక్షువు బోధి హీన్

పి.గన్నవరం, జూన్ 14: రాష్ట్రంలో గత ఐదేళ్లుగా నడిచిన రాక్షసపాలన అంతమొందిందని శ్రీలంక బౌద్ధభిక్షువు బోధి హీన్ అన్నారు. ఏపీలో కూటమి పాలన వస్తుందని ఈనెల 3న తెలంగాణలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో తాను వెల్లడించడం జరిగిందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకలగన్నవరంలో ఆయన డొక్కా సీతమ్మ నివాసాన్ని సందర్శించి అనంతరం మాట్లాడారు. అన్నక్యాంటీన్‌లను స్వాగతిస్తున్నామని, ఎన్నికల సమయంలో పవన్‌కల్యాణ్ డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, ఆమేరకు జనసేన గెలిచిన 21 నియోజకవర్గాల్లో సీతమ్మ క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు ఆయన తెలిపారు. కుల, మతాలకు అతీతంగా భోజనాలు అందించిన ఘనత సీతమ్మకు ఉందని ఆయన గుర్తుచేశారు. పవన్‌కల్యాణ్‌కు శ్రీలంకలో భారీగా అభిమానులు ఉన్నారని, ముఖ్యంగా బౌద్ధ బిక్షువులు, ఉపాసకులలో ఎక్కువ శాతం అభిమానులు ఉన్నారన్నారు. అమరావతి అనే పేరు బౌద్ధమతం నుంచే పుట్టిందన్నారు. ఎన్నికల సమయంలో శ్రీలంక నుంచి వచ్చిన పలువురు బౌద్ధ భిక్షువులు అమరావతి తోపాటు రాష్ట్రమంతా పర్యటించామన్నారు. ముఖ్యంగా అమరావతి రైతులను కలిసి కూటమి ప్రభుత్వం వస్తుందని ధైర్యం చెప్పామన్నారు. త్వరలో నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపేందుకు ఏపీ రాజధాని అమరావతికి శ్రీలంక నుంచి బౌద్ధ భిక్షువులు, బౌద్ధ ఉపాసకులు రాబోతున్నారని ఆయన తెలిపారు. వారందరూ సీఎం చంద్రబాబునాయుడిని కలిసి రాష్ట్రంలో ఉన్న 13 ఉమ్మడి జిల్లాలను కలిపి ఒక కేడర్‌గా ఏర్పాటుచేసి, బౌద్ధాన్ని తద్వారా టూరిజాన్ని అభివృద్ధి చేయాలని కోరతారన్నారు.

జెన్కో చీఫ్ ఇంజనీర్‌గా జవహర్


బాధ్యతలు చేపడుతున్న దృశ్యం

మోతుగూడెం, జూన్14: చింతూరు మండలం మోతుగూడెం సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్‌గా జవహర్‌ను పదోన్నతిపై నియమిస్తూ విజయవాడ విద్యుత్ సౌధ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఉన్న బొడ్డు శ్రీధర్‌ను విద్యుత్ సౌధలోని ట్రైనింగ్ సెంటర్‌కి బదిలీ చేశారు. నూతనంగా నియమితులైన జవహర్‌ను ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ భీమవరపు బాలకృష్ణ, సూపరింటెండెంట్ ఇంజనీర్ సివిల్ కె.ప్రశాంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ వరప్రసాద్, డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.విజయ్‌కుమార్ పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

EDUCATION

» B.Sc. అగ్రికల్చర్ - 4 సం.లు; B.Voc. డైరీయింగ్ & AH - 3 సం॥; B.B.A - ఏవియేషన్ - 3 సం॥ కోర్సులు. అర్హత : ఇంటర్. ప్రభుత్వ / క్యాంపస్ ఉద్యోగాలు కల్ప. అడ్మిషన్లకు సంప్ర : ఆంధ్ర లయోలా కాలేజ్, విజయవాడ. సెల్ : 79891 00323, 74166 98395

AJB - 194703

4 Lines CLASSIFIED Rs.230/- Only


ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ కృష్ణప్రియ

జీవవైవిధ్యం మానవాళికి మూలాధారం

రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ కృష్ణప్రియ

దివాన్‌చెరువు, జూన్ 14: జీవవైవిధ్యం మానవాళికి మూలాధారమని రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ జి.కృష్ణప్రియ అన్నారు. గుంటూరులోని రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సౌజన్యంతో జీవ వైవిధ్య యాజమాన్య కమిటీల శిక్షణా కార్యక్రమం లాలాచెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీలో శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను గ్రామాల్లో తెలియజేసి, తద్వారా వారిని జీవవైవిధ్య పరిరక్షణలో భాగస్వాములను చేయాలని కోరారు. జీవవైవిధ్యంపై అవగాహన, దానిని పరిరక్షించుకోవలసిన అవసరం, జీవవైవిధ్యం చట్టాలను వివరించడం ముఖ్యోద్దేశంగా ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. రెండురోజులు పాటు జరిగే ఈ కార్యక్రమానికి తొలిరోజు రంపచోడవరం, విశాఖపట్టణం, విజయనగరం, చీరాల తదితర ప్రాంతాల నుంచి యాజమాన్య కమిటీ సభ్యులు హాజరయ్యారు. అలాగే అకాడమీ అధికార్లు వి.శ్రీహరిగోపాల్, ఎస్వీ శివరాంప్రసాద్, ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి ప్రాంతీయ కోఆర్డినేటర్లు జానకిరామ్, చెన్నకేశవ, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిని కాపాడిన గూడ్స్‌రైలు డ్రైవర్

అన్నవరం, జూన్ 14: కుటుంబకలహాలు, ఆర్థిక ఇబ్బందులు నేపథ్యంలో రైలుపట్టాలపై పడుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిన వృద్ధుడిని గూడ్స్ రైలు డ్రైవర్ అప్రమత్తతో వ్యవహరించి సడన్ హ్యాండ్‌బ్రేక్ వేసి అతనిని కాపాడిన ఘటన అన్నవరం రైల్వేస్టేషన్‌లో జరిగింది. చిన్నయ్యపాలెంకు చెందిన పసుపులేటి గంగరాజు (82) దొడ్డిగొల్లులో నివాసం ఉంటుండగా అన్నవరం రైల్వేస్టేషన్ పట్టాలపై పడుకుని ఆత్మహత్యకు యత్నించాడు. సామర్లకోట వైపు వెళుతున్న గూడ్స్‌రైలు డ్రైవర్ గమనించి సడన్ బ్రేక్ వేశారు. విషయాన్ని స్టేషన్‌మాస్టర్ రైల్వే ఎస్.ఐ మారూఫ్‌కు సమాచారమిచ్చారు. రైల్వే హెచ్‌సీ శ్యామ్, ఉపేంద్రలు అన్నవరం చేరుకుని వారి వివరాలతో వృద్ధుడిని కుటుంబసభ్యులకు అప్పగించారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

రాజవొమ్మంగి జూన్ 14: రాజవొమ్మంగి మండలంలో శుక్రవారం వర్షం వస్తుందని చెట్టు కింద ఆగిన వ్యక్తి మృత్యువాత పడిన ఘటన ఇది. లాగరాయి గ్రామానికి చెందిన కొల్లి నాగబాబు (30), పెంటకోట దేవకిరణ్ (23) ఏలేశ్వరం నుంచి లాగరాయి వెళుతూ మార్గమధ్యలో వర్షం వస్తోందని లబ్బర్తి గ్రామ సమీపంలో చెట్టు కింద ఆగారు. కాసేపటికి చెట్టుపై పిడుగు పడడంతో నాగబాబు అక్కడికక్కడే మృతి చెందగా, కిరణ్‌కు గాయాలవడంతో స్థానికులు లాగరాయి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



లారీ యాజమానులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు.. పక్కన బండారు స్వామి (ఫైల్‌ఫొటో)

లారీ ఢీకొని వ్యక్తి మృతి

రౌతులపూడి, జూన్14: వివాహమై సంవత్సరం అయ్యింది. హాయిగా సాగిపోతున్న కాపురంలో లారీ రూపంలో మృత్యువు వచ్చి భర్తను పొట్టన బెట్టుకుంది. భార్య ఒంటరికాగా, ఒక్కగాన ఒక్క కొడుకు మృతితో తల్లిదండ్రుల ఆర్తనాదాలతో ఆ గ్రామం శోకసంద్రంలో మునిపోయింది. రౌతులపూడి మండలం పారుపాక గ్రామానికి చెందిన బండారు స్వామి (21) తుని వేళ్లే రహదారిలోని మామిడితాండ్ర ఫ్యాక్టరీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సంవత్సరం కిందట పారుపాక గ్రామానికి చెందిన పార్వతితో వివాహమైంది. ఫ్యాక్టరీలో పని ముగించుకుని వస్తుండగా తేటగుంట- తుని సెంటర్‌లో క్వారీ లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భర్త మృతి చెందిన విషయం తెలిసిన భార్య బండారు పార్వతితో పాటు తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఒక్కడే కొడుకు కావడం, సంవత్సరం కిందటే వివాహం కావడంతో తల్లిదండ్రులు రోదనకు అంతు లేకుండా పోయింది. కాగా ఈ ప్రమాదంలో స్వామి మృతికి కారణమైన లారీ యాజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. లారీలు ఈ రహదారిలో వేగంగా నడుపుతున్నారని, ఇలా ఎంతమందిని చంపేస్తారంటూ గ్రామస్తులు నిలదీశారు. రౌతులపూడి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
APEWIDC, EAST GODAVARI DIVISION

Tenders invited from contractors for NIT No 204, Dt:13.06.2024 in 3 Districts (Kakinada, East Godavari & Konaseema) for 1 work East. cost of Rs.47.21 Lakhs for the work to Providing Infrastructure Facilities to Z.P. High School (Balance work) at Rajanagaram (V&M) under NABARD RIDF-XXV.
Last date for receipt of tender notice Dt.03.07.2024
Note: For further details can be viewed at https://tender.eprocurement.gov.in or contact: 9963018755

(B.Radhakrishnaiah)
Executive Engineer, APEWIDC, Kakinada

ఉపాధి పనుల తనిఖీ

పిఠాపురం రూరల్, జూన్ 14: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెంలో జరుగుతున్న పనులను ట్రైనీ కలెక్టరు భావన శుక్రవారం తనిఖీ చేశారు. కూలీల హాజరు, పనులు జరుగుతున్న తీరుని పరిశీలించారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులు జరుగుతున్న తీరుపై అధికారులను ఆరా తీశారు. ఆమె వెంట డ్వామా ఏపీడీ వసంత మాదవి, ఎంపీడీవో చిన్నారావు, ఏపీవో నాయుడు తదితరులు ఉన్నారు.



జగ్గంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



పిఠాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ



సమావేశంలో డీఎస్సీ విద్యార్థినికి స్వీట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు



సర్పంచివరం: సీఎం చంద్రబాబుకు జై కొడుతున్న టీడీపీ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి

ప్రజారంజక పాలన ప్రారంభించిన సీఎం

జగ్గంపేట, జూన్14: ఓటు బ్యాంకు రాజకీయాలకు స్వస్తి చెప్పి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకే ఐదు సంవత్సరాల పరిపాలన సాగుతుందనడానికి నిదర్శనం సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రజలందరికీ మేలు చేకూరే విధంగా ఐదు హామీలపై సంతకాలు చేయడంపై జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన వెంటనే తొలి సంతకం మెగా డీఎస్సీపై పెట్టారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛన్ల పెంపు, అన్నక్యాంటీన్ పునరుద్ధరణ, వృత్తినైపుణ్య శిక్షణ పథకంపై సంతకాలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. తనకు మంత్రిపై ఆలోచన లేదని నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రత్యేక హామీలు నెరవేర్చడానికి సీఎంతో మాట్లాడి నిధులు తెచ్చుకోవడానికి అవకాశం కలిగిందన్నారు. నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలపై అవినీతి జరిగిందని దీనిపై ప్రత్యేక కమిటీ వేసి అర్హులకు న్యాయం చేస్తామని నెహ్రూ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్వీ ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పాటంశెట్టి రవి, అన్నవరం రాము, గల్లా రామచంద్రరావు పాల్గొన్నారు.

తొలి సంతకాలతోనే చిత్తశుద్ధి నిరూపించుకున్నారు : వర్మ

పిఠాపురం, జూన్ 14: ఎన్నికల ముందు ప్రకటించిన హామీల్లో ఐదింటిని అమలు చేస్తూ బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే ఐదు సంతకాలు చేయడం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు తన చిత్తశుద్ధిని, ప్రజల పట్ల ఉన్న అంకితభావాన్ని నిరూపించుకున్నారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. చంద్రబాబు కార్యదక్షతకు ఇది నిదర్శనమని చెప్పారు. సీఎం తొలి ఐదు సంతకాలతో ప్రయోజనం పొందే లబ్ధిదారులు, ఆయా వర్గాల ప్రజలతో కలిసి శుక్రవారం పిఠాపురం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ మెగా డీఎస్సీ ద్వారా 16,3467 ఉద్యోగాల భర్తీకి సంతకం చేయడమేగాక వెంటనే జీవో జారీ చేశారని, డిసెంబర్‌లోగా ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారన్నారు. అవ్వతాతలకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ల మొత్తాన్ని రూ.4వేలకు పెంచడమే కాకుండా జూలై నెలలో బకాయిలతో కలిసి రూ.7వేలు ఇవ్వనున్నారని తెలిపారు. రైతుల ఆందోళనలతో ఏకీభవిస్తూ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేస్తూ మరో సంతకం చేశారని చెప్పారు. ప్రజల తరపున చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో టీడీపీ పట్టణ కన్వీనర్ కొండేపూడి సూర్యప్రకాష్, నాయకులు పిల్లి చిన్నా, బర్ల అప్పారావు, పడాల అప్పారావు, కొరుప్రోలు శ్రీను, అల్లవరపు నగేష్, రాయుడు శ్రీను, కొర్ని రమణ, మేరుగు భూషణం పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకునే నాయకుడు చంద్రబాబు

● తుని ఎమ్మెల్యే యనమల దివ్య



తునిరూరల్, జూన్ 14: ఇచ్చిన మాట నిలబెట్టుకునే నాయకుడు తమనేత ముఖ్యమంత్రి చంద్రబాబు అని తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు తీసుకున్న వెంటనే తొలి సంతకం మెగా డీఎస్సీపై చేసి వేలాదిమంది నిరుద్యోగుల ఆశలకు ఊపిరిపోశారన్నారు. 16,347 టీచర్స్ పోస్టు భర్తీకి నిర్ణయం తీసుకోవడంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. . నైపుణ్యగణనపై ఐదో సంతకం, నిరుద్యోగ యువతకు భవిష్యత్‌కు భరోసా ఇచ్చేలా ఉందన్నారు. ఆమె వెంట స్థానిక టీడీపీ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు, మోతుకూరి వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి ఉన్నారు.

ఏపీ అభివృద్ధికి తొలి అడుగులు: ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, జూన్ 14: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు చేసిన తొలి ఐదు సంతకాలు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తొలి అడుగులని కాకినాడ సిటీ ఎమ్మెల్యే విజేత వనమాడి కొండబాబు అన్నారు. స్థానిక జగన్నాథపురంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట చంద్రబాబు నిలబెట్టుకున్నారన్నారు. మొదటగా మెగా డీఎస్సీపై ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్లు రూ.4వేలకు పెంపు, అన్నక్యాంటీన్‌ల పునరుద్ధరణ, నైపుణ్యాభివృద్ధి ఫైల్స్‌పై తొలి ఐదు సంతకాలు చేయడం ఆనందకరమన్నారు. పెన్షన్‌దారులు, న్యాయవాదులు, నిరుద్యోగులు, యువకులు ఎమ్మెల్యే కొండబాబుకు స్వీట్లు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, దండుప్రోలు నాగబాబు, చింతలపూడి రవి, అమలకంటి బలరామ్, లక్ష్మీప్రసన్న, లీగల్ సెల్ ప్రతినిధులు, యుటీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా..

సర్పవరం జంక్షన్, జూన్ 14:రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తొలిరోజే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా కీలకమైన ఐదు అంశాలపై సంతకాలు చేశారని కాకినాడరూరల్ టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, కో కోఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ) అన్నారు. శుక్రవారం వలసపాకలలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, 47వ డివిజన్ కరణంగారి సెంటర్‌లో బాబీల ఆధ్వర్యంలో వివిధ వర్గాల లబ్ధిదారులు, పార్టీ కేడర్‌తో కలసి సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి వెంకట్రాజు, జి.శ్రీనివాసరావు, బొజ్జ భవాని, వేటుకూరి నాగమణి, పలివెల గాయత్రి, ఎం. శ్రీనివాసరావు, కాకరపల్లి చలపతిరావు, జంక్షన్ బాబ్జి, కొజు నెహ్రూ, వెంకటలక్ష్మి, గీసాల శ్రీనివాసరావు, కె వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు తొలిసంతకంపై ఎమ్మెల్యేలు, నాయకుల హర్షం

ప్రత్తిపాడులో టీడీపీ సంబరాలు

ప్రత్తిపాడు, జూన్14: శుక్రవారం మండలంలోని టీడీపీ కూటమి శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ఒమ్మంగిలో టీడీపీ నాయకులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంచారు. ధర్మవరంలో టీడీపీ నాయకులు వృద్ధులకు స్వీట్లు పంచి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తరకంచి, చింతలూరు గ్రామాల్లో టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ సత్యంశెట్టి సీతబాబు,సుంకర సోమరాజు,రామిశెట్టిమునిసీబు, బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, జనసేన, బీజేపీ నాయకులు దాసంశేషారావు, బుగతా సోమరాజు పాల్గొన్నారు. ప్రత్తిపాడులో శుక్రవారం రాత్రి టీడీపీ కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ల విశ్వేశ్వరరావు, సింగిల్‌దేవ్ సత్తిరాజు, మూర వరప్రసాద్, తదితరులు కేక్ కట్‌చేసి అభిమానులు, కార్యకర్తలకు కేక్ పంపిణీ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు ఎన్నికల హామీల అమలుకు సంతకాలు చేయడం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఏలేశ్వరం: ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పెద్దనాపల్లి గ్రామంలో, మున్సిపల్ చైర్ పర్సన్ అలమండ సత్యవతి, చలమయ్య నివాసం వద్ద, పట్టణ అధ్యక్షుడు మూది నారాయణ స్వామి స్థానిక బాలాజీ చౌక్ సెంటర్‌లో, లింగంపర్తి, భద్రవరం, రాయవరం పలు గ్రామాల్లో టీడీపీ నేతలు భాణా సంచా కాల్చి, కేకులు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కౌన్సిలర్‌లు బొదిరెడ్డి గోపి, కోనాల వెంకట రమణ, టీడీపీ శ్రేణులు జిగటాపు సూరిబాబు, గొల్లపల్లి ఆనందం, కొప్పుల బాబ్జి, చిక్కాల లక్ష్మణరావు, శెట్టి బుల్లియ్య, నూకతాటి ఈశ్వరుడు, వాగు రాజేష్, బుగతా శ్రీను, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నెహ్రూను కలిసిన నాయకులు, అధికారులు

జగ్గంపేట, జూన్ 14: జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను శుక్రవారం నాయకులు, అధికారులు కలిశారు. కాపు సంఘం నాయకులు మారిశెట్టి భద్రం, మారిశెట్టి రాధ, దవులూరి ఈశ్వరరావు, బండారు రాజా, తులా నరసింహరావు, తులా రాము, తోలేటి సూర్యనారాయణ, తోట బుచ్చిరాజు, కురుమళ్ల నాగేశ్వరరావు తదితరులు ఎమ్మెల్యే నెహ్రూ, నవీన్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అదేవిధంగా ఏపీఎన్జీవో యూనిట్ అధ్యక్షుడు వివివి కృష్ణ, కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, ట్రజరర్ పి.ప్రభాకర్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎన్.సునీల్‌కుమార్‌వర్మ, వైస్ ప్రెసిడెంట్ బత్తుల పుష్పరాజు, సీహెచ్ ప్రఫూల్ కుమార్, జాయింట్ సెక్రటరీ ఎల్.నాగేశ్వరరావు, రాజారత్నం, ఎం.సురేష్, పి.రోజా మేరి కలిశారు. ఏపీ ఐఐసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, జగ్గంపేట పంచాయతీ కార్యదర్శి రాజన్ రాజు, రాయి సాయి యూత్ పాండ్రంకి రాంబాబు, బస్వా చినబాబు, సూర్నీడి రాంబాబు, సేనాపతి వీరబాబు, కొరారి కృష్ణ, మద్దాల వీరబాబు, కొరారి గంగ, శైలా శ్రీను కలిసి పుష్పగుచ్ఛమిచ్చి ఘనంగా సత్కరించారు.

● ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగస్తుల సమస్యలను టీడీపీ ప్రభుత్వంతోనే తగు న్యాయం చేస్తారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జగ్గంపేట ఏపీ ఎన్జీవో యూనిట్ అధ్యక్షుడు వీవీవీ కృష్ణ, కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, ట్రెజరర్ పి.ప్రభాకర్, యూనిట్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జ్యోతుల నవీన్‌ను కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమం జగ్గంపేట యూనిట్ సభ్యులు అసోసియేట్ ప్రెసిడెంట్ ఎన్. సునీల్‌కుమార్‌వర్మ, వైస్‌ప్రెసిడెంట్ బత్తుల పుష్పరాజు, సీహెచ్ ప్రఫూల్‌కుమార్, జాయింట్ సెక్రటరీ ఎల్ నాగేశ్వరరావు, కె. రాజారత్నం, ఎస్. సురేష్, పి. రోజామేరీ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూకు అభినందనలు తెలిపిన కాపు సంఘం

ఎమ్మెల్యేగా నాల్గోసారి అత్యధిక మెజార్టీతో గెలిచిన జ్యోతుల నెహ్రూను, మాజీ జడ్పీ చైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్‌ను కాపు సంక్షేమ సంఘం తరుపున మర్యాదపూర్వకంగా నాయకులు కలసి తమ అభినందనలు తెలిపారు. మారిశెట్టి భద్రం, మారిశెట్టిరాధ, దవులూరిఈశ్వరరావు, రాజా, నరసింహారావు, తులారాము, తోలేటి సూర్యనారాయణ, తోటబుచ్చిరాజు, కరిముల్ల నాగేశ్వరరావు, సూరపురెడ్డి విష్ణువు, పుర్రే సూరన్న,అంగజాల బ్రహ్మాజీ, మంచాలమల్లేశ్వరరావు ఉన్నారు.

కిర్లంపూడి: సోమవరం గ్రామంలో సీనియర్ టీడీపీ నాయకుడు జంపన సీతారామచంద్రవర్మను సెక్రటరీ రాంబాబు, వీఆర్వో రాముడు, సచివాలయం సిబ్బంది, జ్యోతుల కోటి, మురళీ, శివ, ఏసుబాబు, సచివాలయ సిబ్బంది కలిశారు. అలాగే వీరవరం, గెద్దనాపల్లి వైద్యాధికారులు వి.అరుణ, సీహెచ్ జ్యోతిమణిమాల, ఆరోగ్య సిబ్బంది గంగాధర్, భాస్కరరావు, కె.రామకృష్ణ, ఎస్వి రమణ, జేమ్స్, కె.తాతారావు ఎమ్మెల్యే నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జనసేన ఇన్‌చార్జిని కలిసిన నాయకులు

జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్‌ను శుక్రవారం మండలంలోని రామచంద్రపురంలో ఆయన స్వగృహంలో బావారం జనసైనికులు కలిసి అభినందించారు. కూటమి గెలుపులో జగ్గంపేట నుంచి కృషిచేసిన రమేష్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అన్నవరంలో టీడీపీ శ్రేణుల సంబరాలు

అన్నవరం, జూన్ 14: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఎన్నికల హామీలో ప్రకటించిన 5పథకాలకు సంతకాలు చేసిన నేపథ్యంలో శుక్రవారం టీడీపీ శ్రేణులు స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. పార్టీ నాయకులు మెరపల నరసయ్య బొమ్మిడి సత్తిబాబు, రాజాల చిట్టిబాబు, పసుపులేటి చక్రి, పలివెల సతీష్, కడుపుకుట్ట కృష్ణ, పంచదార్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

సామర్లకోట: ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా తెలుగుదేశం పార్టీ జాతీయాధ్యక్షులు, నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడు తన తొలిసంతకాన్ని మెగా డీఎస్సీ నియామకంపై చేయడంపట్ల సామర్లకోట మండల టీడీపీ అధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు మామిడాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మురారి టీడీపీ నాయకుడికి ఘన సత్కారం

గండేపల్లి, జూన్ 14: మండలంలోని మురారి గ్రామ టీడీపీ యువ నాయకుడు జాస్తి వసంత్‌ను శుక్రవారం రజక సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సుంకవిల్లి రాజు, గద్దె అబ్బన్న, ఉండవిల్లి బులిరాజు, రజక సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నెహ్రూను కలిసిన మల్లేపల్లి నాయకులు

ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను శుక్రవారం మండలంలో యల్లమిల్లి, మల్లేపల్లి, తాళ్ళూరు గ్రామాలకు చెందిన నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. ఉపాధి హామీ సిబ్బంది నెహ్రూను కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పరిమి బాబు, కుంచే రాజా, మాదిరెడ్డి కృష్ణార్జున, సుంకవిల్లి రమేష్, దేవిశెట్టి బాబ్జి, సుంకవిల్లి వీరవెంకటసత్యనారాయణ, మల్లేపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు తెలగరెడ్డి భద్రరావు, తాళ్ళూరు సర్పంచ్ శీలామంతుల వీరబాబు, ఉపసర్పంచ్ ఫైణ్ణి వెంకటేశ్వరరావు, కొండ్రు అప్పలరాజు, దా పర్తి సీతారామయ్య, ఉపాధి హామీ ఈసీ రమేష్, ఎం. రాంబాబు, ముండ్రు వాసు పాల్గొన్నారు. అలాగే తెలుగు యువత నేత రాయి సాయి ఆధ్వర్యంలో యువకులు జ్యోతుల నెహ్రూను శుక్రవారం కలిశారు.

చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం

శంఖవరం: వజ్రకూటం గ్రామంలో సంబరాలు చేసుకున్నారు. పేన్షన్‌దారులు, యువత, టీడీపీనేతలు మాజీ సర్పంచ్ కీర్తి సుభాష్ అధ్వర్యంలో చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంచారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో కేశంగి బుచ్చిరాజు, కండిపిల్లి సూర్యనారాయణ, వాసంశెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమం జోరు: తుమ్మల బాబు

సామర్లకోట, జూన్ 14: కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధి చెందుతుందని కాకినాడ జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మల బాబు పేర్కొన్నారు. జనసేన అధ్యక్షులు, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కళ్యాణ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సామర్లకోటలో జనసేన నాయకులు, కార్యకర్తలు పట్టణ జనసేన అధ్యక్షులు సరోజ్ వాసు ఆద్వర్యంలో శుక్రవారం కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

మంత్రి అచ్చెంన్నాయుడును కలిసిన ఎమ్మెల్యే



మంత్రులు, అచ్చెంన్నాయుడు, వంగలపూడి అనితను కలిసిన సత్యప్రభ

ప్రత్తిపాడు, జూన్14: రాష్ట్ర హోంశాఖా మంత్రి వంగలపూడి అనితను, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖా మంత్రి కె.అచ్చెంన్నాయుడును ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం విజయవాడలోని ఇరువురు మంత్రుల కార్యాలయాలకు వెళ్లి వారికి బోకేలు అందజేసి శాలువా కప్పి సన్మానించారు. మంత్రులుగా రాష్ట్ర అభివృద్ధికి, తమ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆమె వెంట ఎమ్మెల్యే అఖిల ప్రియ కూడా ఉన్నారు.

పవన్ చిత్రపటానికి పాలాభిషేకం

పెద్దాపురం, జూన్ 14: స్థానిక బండారమ్మ గుడి వీధిలో జనసేన నేత తుమ్మల రామస్వామి ఆధ్వర్యంలో పవన్ చిత్ర పటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. పవన్‌కు డిప్యూటీ సీఎంగా ఎన్నికైన సందర్భంగా పవన్ చిత్రటానికి పాలాభిషేకం చేసి, 101 కొబ్బరికాయలు కొట్టారు. ఈకార్యక్రమంలో గొంతిన శ్రీను, తమనార లక్ష్మణ దివాకర్, ఒబిలిశెట్టి గణేష్, జనసైనికులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుపై న్యాయవాదుల హర్షం

పిఠాపురం, జూన్ 14: ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు పట్ల పిఠాపురంలో న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. పిఠాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో స్వీట్లు పంపిణీ చేసి తమ ఆనందాన్ని తెలియజేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాదన కార్యదర్శులు ఎం.రాజారావు, కేఎస్ భాస్కర్‌లు మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వలన సామాన్యులు, పేద రైతులకు జరిగే నష్టాలను ముందుగా న్యాయవాదులే గుర్తించారన్నారు. బార్ ఉపాధ్యక్షుడు ఎస్ఎం అలీ, న్యాయవాదులు బీవీఎస్ రాజు, బీఎల్ దొర, సూరవరపు వెంకటేశ్వరరావు, వీవీ నగేష్, ముమ్మిడి రామకృష్ణ, బుద్దాల చంటిబాబు, పితాని వెంకటేశ్వరరావు, ఎస్. నాగేశ్వరరావు, ఏ.గీత పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకం చేసి చర్యలు చేపట్టడాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్తిపాడు న్యాయవాదులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో బార్ అధ్యక్షుడు అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు కేక్ కట్ చేసి న్యాయవాదులకు, బార్ న్యాయవాదులకు పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబుకు న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు రాజాల చిట్టిబాబు, మళ్ళ గంగాధర్, పిల్లి బలరాముడు, బత్తిన చలం, బోడపాటి అశోక్‌కుమార్, లింగంపల్లి శివకుమార్, కలవలపల్లి సుజన, న్యాయవాద గుమస్తాలు వీరాస్వామి, బాబి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీహోమం

అన్నవరం, జూన్ 14: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు.

ఫిజియోథెరపీ కళాశాలలో జాబ్‌మేళా

కరప, జూన్ 14: పెనుగుదురులోని కాకినాడ సిమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళాను నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యప్రకాష్ తెలిపారు. ఈపీఐ సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, చెన్నై ఆధ్వర్యంలో జరిగిన ఈ జాబ్‌మేళాకు 120మంది ఫిజియోథెరపీ విద్యార్థులు హాజరైనట్లు ఆయన చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు మంచి వేతనాలతో చెన్నై, హైదరాబాద్, బెంగుళూర్ నగరాల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు. కళాశాల సెక్రటరీ శివశిరీష, డైరెక్టర్ భరత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాత తాతీలుకు సత్కారం

కరప, జూన్ 14: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కాకినాడ సూర్యకళామందిరంలో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 89సార్లు రక్తదానం చేసిన కరప మాజీసర్పంచ్ పోలిశెట్టి తాతీలును ఘనంగా సత్కరించారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాకినాడ 3వ అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి విచ్చేసి సామాజికసేవ చేస్తున్న తాతీలును సత్కరించి పూలమొక్కను అందజేశారు.

ఆధునికీకరణ పనులను ప్రారంభించిన జిల్లా ఎస్పీ

సామర్లకోట, జూన్ 14: సామర్లకోట పోలీస్‌స్టేషన్ భవనాన్ని వివిధ విభాగాలలో దాత జెపీ కన్‌స్ట్రక్షన్స్ అధినేత చక్కని ప్రభాకరరావు సౌజన్యంతో పూర్తిచేసిన ఆధునికీకరణ పనులను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై శిలాఫలకాన్ని డీఎస్పీతో కలిసి ఆవిష్కరించారు. పోలీసులకు విశ్రాంతి మందిరాన్ని జెపీ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ప్రభాకరరావు ప్రారంభించారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగికి పనిచేసే ప్రదేశం బాగుంటే విధి నిర్వహణలో మరింత ఉత్సాహంగా పాల్గొంటారని చెప్పారు. పాతబడిన భవనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన జేపీ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ప్రభాకరరావును, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినంది ంచారు. ఎస్‌హెచ్‌వో సురేష్, క్రైం సీఐ అంకబాబు, సామర్లకోట ఎస్ఐలు మౌనిక, పీవీఆర్.మూర్తి, సతీష్, రత్నం, సింహాద్రి తదితర పోలీసులు పాల్గొన్నారు.

రగ్బీ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు పయనం

పిఠాపురం, జూన్ 14: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మెన్స్ సీనియర్స్ జట్టు వెళ్లింది. బాపట్లలో ఈనెల 15,16వ తేదిల్లో జరగనున్న 9వ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు శుక్రవారం పిఠాపురం నుంచి బయలుదేరారు. వీరు ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్రకుమార్, కె.పద్మనా భం, చిన్నబ్బాయి, బి.వంశీ, కోచ్‌లక్ష్మణరావులు తెలిపారు. సభ్యులను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ అభినందించారు.

రోటరీ బ్లడ్ బ్యాంక్ సేవలు అభినందనీయం

● మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి

కాకినాడ సిటీ, జూన్ 14: ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు సకాలంలో రక్తం అందించి వారి ప్రాణాలను కాపాడేం దుకు రోటరీ బ్లడ్ బ్యాంక్ ముం దుకు రావడం అభినందనీయమని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడలోని అన్ని రోటరీక్లబ్‌ల ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళా మందిరంలో మెగా రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ కాకినాడ, గోల్డెన్ జూబ్లీ క్లబ్‌ల అధ్యక్షుడు నరహరిశెట్టి రవికృష్ణ, ఫైలపల్లి విద్యాసాగర్ అధ్యక్షత వహించారు. జడ్జిలు పి.కమలాదేవి, ఎం.హరినారాయణ, నికిత ఆర్.వరోరా, కె.శ్రీదేవి విశిష్టఅతిథులుగా, రోటరీ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు లక్కరాజు సత్యనారాయణ, డాక్టర్ ఎస్వీఎస్ రావు గౌరవ అతిథులుగా విచ్చేశారు. కార్యక్రమంలో భాగంగా అతిథులు తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో రోటరీ క్లబ్‌ల సభ్యులు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలకు రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ రామకృష్ణ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు గోపు కాశీ విశ్వనాథ్, దొడ్డి వీరేంద్ర, అవినాష్, అజయ్, చార్మినార్ వర్మ, వెంకట్, చందు నాయక్, కృష్ణ, శేఖర్, బాబి పాల్గొన్నారు.

రక్తదానం చేయడంలో యువత ముందుండాలి : తుమ్మల బాబు

పెద్దాపురం, జూన్ 14: రక్తదానం చేయడంలో యువత ముందుండాలని జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎల్ఐసీ కాలనీలో ఉన్న రోటరీ రక్తదాన కేంద్రంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి, రక్తదానం చేసేందుకు ముందుకు రావడం మానవత్వానికి ప్రతీక అన్నారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు కఠారి శ్రీను, కొప్పిరెడ్డి నాగబాబు, సత్య, స్వామి, కుమార్, కరెడ్ల రాజా, రమేష్, సునీల్, సనంద్, జయశ్రీ, దేవత రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రపంచ రక్తదాతల దినోత్సవం

గండేపల్లి: ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం 2024ను నిర్వహించారు. 25మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రక్తదానం గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విలాస్ అనిల్ చవాన్, వైస్ ప్రిన్సిపాల్ పి.నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బికె విద్యాసాగర్ పాల్గొన్నారు.

చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి: ఎమ్మెల్యే విజేత రాజప్ప

పెద్దాపురం, జూన్ 14: చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని తద్వారా వారిలో వారిలో అంతర్లీనంగా దాగిఉన్న నైపుణ్యం, విజ్ఞానం బయటకు వస్తాయని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక బ్యాంక్ కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన లిటిల్ బీ ప్రీస్కూల్‌ను ఆయన శుక్రవారం ఆయన ప్రారంభోత్సవం చేశారు. ప్రీస్కూల్స్ ద్వారా విద్యార్థుల మానసిక ఎదుగుదలకు, విజ్ఞానాభివృద్ధికి దోహదపడతాయన్నారు.

ఏడో రోజుకు ఆర్టీసీ డ్రైవర్ల నిరసన

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 14: కాకినాడ ఆర్టీసీ డిపో డ్రైవర్ వెంకటేశ్వర్లును అధికారులు అన్యాయంగా సస్పెండ్ చేశారంటూ ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా ప్రభుత్వ డ్రైవర్స్ హెల్పర్స్ అసోసియేషన్ యూనియన్ డ్రైవర్లు నిరసన మంగళవారంతో ఏడో రోజుకు చేరుకుంది. న్యాయం జరిగే వరకు పోరాడతామని డ్రైవర్లు తెలిపారు. యూనియన్ ముఖ్య సలహాదారులు పెద్దిరెడ్డి సత్యనారాయణ, చైర్మన్ శేషుకుమార్, రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి, డ్రైవర్లు పులి లోవరాజు, ద్వారంపూడి శ్రీను, ఎస్కే మూర్తి ఉన్నారు.

నేడు ఛలో రాజోలు డిపో

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 14: రాజోలు డిపో కండక్టర్ మరణానికి ఆర్టీసీ యాజమాన్య విధానాలే కారణమని ఏపీపీటీడీ యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షుడు కేవీబీ రాజు అన్నారు. ఈ మేరకు ఛలో రాజోలు డిపో కార్యక్రమం శనివారం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వైసీపీ నాయకులు బలవంతంగా రాజీనామా చేయించారు

● కొండబాబు వద్ద మొరపెట్టుకున్న వలంటీర్లు

కాకినాడ సిటీ, జూన్ 14: వైసీపీ వాళ్లు బలవంతంగా రాజీనామా చేయించారని, తమకు ఎటువంటి జీవనాధారం లేక రోడ్డున పడ్డామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వద్ద వలంటీర్లు మొరపెట్టుకున్నారు. ఎన్నికల ముందు వలంటీర్ ఉద్యోగాలకు రాజీనామా చేసిన పలువురు జగన్నాథపురంలోని ఎమ్మెల్యే కొండబాబుకు నివాసానికి వచ్చి తమ బాధలు శుక్రవారం విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ వలంటీర్లతోపాటు అందరినీ జగన్ మోసం చేశాడన్నారు. రాజీనామా చేసిన వలంటీర్ల పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తెచ్చి ఆదుకోవాలని కోరతానన్నారు.

చిన్నారులకు సాయం అందజేత

కాకినాడ సిటీ, జూన్ 14: ప్రసవం అనంతరం ఆస్పత్రుల్లోను, రోడ్లవార వదిలేస్తున్న చిన్నారులకు ఆశ్రయం కల్పిస్తున్న శిశు గృహకు రూ.20వేల విలువ చేసే క్రెడిల్, దుప్పట్లను హరీష్ ఛారిటబుల్ ట్రస్ట్, సానా సతీష్‌బాబు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశారు. కాకినాడ విద్యుత్‌నగర్‌లోని శిశుగృహలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట్రావు మాట్లాడుతూ క్రెడిల్ బహూకరించిన ఈ సంస్థల నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యానవనాల అభివృద్ధికి చర్యలు : కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 14: ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించే ఉద్యానవనాలను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. శుక్రవారం ఆయన కాకినాడ వివేకానంద పార్కును సందర్శించారు. అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. పార్కు ఆవరణలోని పచ్చదనాన్ని, వాకింగ్ ట్రాక్, క్రీడా పరికరాలను పరిశీలించారు. వివేకానంద పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కమిషనర్‌ను కలిసి పలు అంశాలు ఆయన దృష్టికి తెచ్చారు. పింక్ టాయిలెట్లు, ఇతర ప్రాంతాల్లోని స్మార్ట్ పబ్లిక్ టాయిలెట్లను, డంపింగ్ యార్డును కమిషనర్ సందర్శించారు. ఆయన వెంట నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.సత్యకుమారి, స్మార్ట్‌సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, ఈఈ మాధవి, డీఈ సుబ్బారావు, ఏఈ వై.నాగేశ్వరరావు ఉన్నారు.

సీఎం కార్యాలయ కార్యదర్శి రవిచంద్రకు సత్కారం

కాకినాడసిటీ, జూన్ 14: సీఎం కార్యాలయ కార్య దర్శిగా బాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్రను సీఎంవో కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగో దావరి జిల్లా తరఫున ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు, ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ పితాని త్రినాథ్ శాలువాతో శుక్రవారం సత్కరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా ముద్దాడ రవిచంద్ర అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి : ఉమర్ ఆలీషా

పిఠాపురం, జూన్ 14: ప్రతిఒక్కరు తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో బాగస్వాములు కావాలని విశ్వవిజ్ఞాన విద్యా ఆద్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా సూచించారు. నా మొక్క నా శ్వాస కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో పిఠాపురంలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో అహ్మద్ ఆలీషా, మహబూబ్ భాషా, హుస్సేన్‌షా, కబీర్‌షా, ఆర్కే శివరామకృష్ణన్, రేకా ప్రకాష్, సానబోయిన కృష్ణకుమార్, పీఠం సభ్యులు పాల్గొన్నారు.

పని కోరిన ప్రతిఒక్కరికీ పనులు కల్పించండి

జగ్గంపేట, జూన్14: జగ్గంపేట ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు వద్ద జగ్గంపేట నియోజకవర్గ ఉపాధిక హామీకి సంబంధించి జగ్గంపేట, గండేపల్లి, గోకవరం, కిర్లంపూడి మండలాల జేఈలు,ఏపీవోలు, ఈసీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులతో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని కోరిన ప్రతి ఒక్కరికి పని కల్పించి నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలన్నారు.

Anand
CINEMAS
(4 SCREENS)
Experience it in 4K Dolby Atmos
BHANUGUDI JUNCTION KAKINADA
BOOK ONLINE TICKETS Paytm
NOW SHOWING



INDRANI (TEL) (U/A)
11-15AM, 2-30PM, 6-20PM, 9-30PM
BAJE VAAYU VEGAM (TEL) (U/A)
11-30AM, 2-15PM, 6-30PM, 9-15PM
HAROM HARA (TEL) (A)
11-40AM, 2-45PM, 6-45PM, 9-45PM
MAHARAJA (TEL) 11-20AM, 6-40PM
RAAJDHANI ROWDY (A) 2-20PM, 10-00PM

తుని పురపాలక సంఘం
ఆర్.ఒ.సి.నెం.388/2017/ఇ1 తేది:14-06-2024
'ఇ'ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
తుని పురపాలక సంఘము నందు సాధారణ నిధుల నుండి 5 పనులు చేపట్టి పూర్తిచేయుటకు 'ఇ'ప్రొక్యూర్‌మెంటు ప్లాట్‌ఫారం పై టెండరు ఆహ్వానించడమైనది. సదరు టెండరుకు సంబంధించిన ఇతర వివరములు ది.15-06-2024 ఉదయం గం 11.00 నుండి www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.
సంప్రదించవలసిన చిరునామా: కమిషనరు, తుని మున్సిపాలిటీ ఫోన్ నెం.9849905806, 9849919375, 08854-253506 e-mail: tunimunicipality@gmail.com
సం/- ఎ. వెంకటరావు
కమిషనరు, తుని పురపాలక సంఘం